క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్, 11 కేవీ గ్రీన్‌పార్క్, కైలాసపురం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. కస్తూరినగర్ – 1, 2, మధుసూదననగర్, దుర్గాకైలాస్‌నగర్, సత్యసాయినగర్, కైలాసపురం మెయిన్‌రోడ్, నరసింహనగర్ రైతుబజార్, మెయిన్ రోడ్, బిజినెస్ సెంటర్, విద్యుత్‌నగర్, బాలయ్యశాస్త్రి లే అవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీ సచివాలయం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సీతమ్మధార : నగరంలోని హెచ్‌టీ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం, సత్యం జంక్షన్, వెంకటేశ్వర కళాశాల, సుధా నర్సింగ్ హోమ్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ధర్నా విజయవంతానికి పిలుపు


సమావేశంలో కార్మికులు, నాయకులు

మద్రిపాలెం : సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఈ నెల 28న జ్ఞానాపురంలోని జోన్ – 5 జోనల్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 49, 50, 51వ వార్డుల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల నుంచి 2 శాతం ఆదాయపు పన్ను పేరుతో కట్ చేసి సుమారు రూ.3 కోట్లు ఎస్‌ఎల్‌ఎఫ్ ఖాతాలో ఉంచడం అన్యాయమన్నారు. వెంటనే ఆ సొమ్మును కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, లేకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో భద్ర, పాపారావు, దేవి, లక్ష్మి, రమణ, శివ, అప్పలరాజు, శంకర్, బంగారయ్య, బాలరాజు, ధన, సత్యవతి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మద్రిపాలెం : ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బెహరా రీత (23) భర్త, కుమారుడితో కలిసి గోపాలపట్నంలో నివసిస్తుండేవారు. ఆమె డ్రైక్లీనింగ్ షాప్‌లో పనిచేస్తుండగా... భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం గొల్ల కంచరపాలెంలో నివసిస్తున్న సోదరి ఇంటికి రీత వెళ్లింది. అదేరోజు సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రీత ఆర్థిక పరిస్థితి బాగోలేదని, అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

అప్రెంటిస్‌షిప్ మేళా నేడు

అగనంపూడి: హైదరాబాద్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి శుక్రవారం ఉదయం 9గంటలకు లంకెలపాలెం సమీపంలోని హైటెక్ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు హైటెక్ ఐటీఐ ప్రిన్సిపాల్ దుర్గునాయుడు తెలిపారు. ఈ మేళాలో వంద ఫిట్టర్, 40 పెయింటర్, 30 మిషనిస్ట్ ఖాళీలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అప్రెంటిస్ సమయంలో నెలకు రూ.11వేలు, శిక్షణ పూర్తి అయిన తరువాత కొనసాగేవారికి నెలకు రూ.17వేలు వేతనంగా చెల్లిస్తారని తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, రవాణా చార్జీలు చెల్లిస్తారన్నారు. 18 నుంచి 24 సంవత్సరాల వయసు గల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు.

హడలెత్తిస్తున్న శునకాలు




రాకపోకలకు భయపడిపోతున్న 45వ వార్డు ప్రజలు


పోర్టు క్వార్టర్స్ ప్రాంతంలో శునకాల గుంపు


పోర్టు హాస్పిటల్ ప్రాంగణంలో శునకాలు


ఇనార్బిట్‌మాల్ వద్ద గుంపుగా రోడ్డుపై శునకాలు

తాటిచెట్లపాలెం : రోడ్లపై ప్రయాణం చాలంటే జనం హడలిపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పనులు ముగించుకుని, ఉద్యోగాల నుంచి విద్యా సంస్థల నుంచి ఇంటికి చేరుకునే వారికి శునకాలు చుక్కలు చూపిస్తున్నాయి. జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్, పోర్టు క్వార్టర్స్, ఇనార్బిట్ మాల్ పరిసర ప్రాంతాలు, సింహగిరికాలనీ, సత్యసాయినగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో పగలూ రాత్రి అన్న తేడా లేకుండా రోడ్లపైనే తిష్టవేసి కూర్చుంటున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు కుక్కల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల వెంట పడి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కుక్కలు వెంబడిస్తున్నాయని వేగంగా వాహనాలు నడిపే వారంతా ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనదారులను కరిచే వరకూ వదలడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోర్టు క్వార్టర్స్ ప్రాంతంలో అయితే పగలే రోడ్డుపై గుంపులుగా చేరి ప్రజలను వెంటాడుతున్నాయి. చిన్నపిల్లలు, పెద్దలు, వాహనదారులు, నడిచి వెళ్లే వారు... ఇలా ఎవరినీ ఈ కుక్కలు విడిచిపెట్టడం లేదు. ఇటీవల కాలంలో జీవీఎంసీ అధికారులు వీటిని పట్టించుకోవడం మానేశారని, నియంత్రణకు చర్యలు తీసుకుని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఇటీవల కాలు కరిచేసింది

ఇటీవల పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా సమీపంలో రోడ్డు మీద వాహనం దిగుతున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన కుక్క నా కాలు కరిచేసింది. దీంతో చాలా ఇబ్బంది పడి, ఇంజక్షన్లు చేయించుకున్నా. కుక్కలను చూస్తే భయమేస్తోంది.

– బి.సరోజిని, కైలాసపురం

అధికారులు చర్యలు తీసుకోవాలి

రాత్రి వేళల్లో నరసింహనగర్, పోర్టు క్వార్టర్స్, ఇనార్బిట్‌మాల్ ప్రాంతాల్లో కుక్కలు చాలా ఇబ్బంది పెడుతున్నాయి. వాహనాల మీద వెళ్తున్న సమయంలో హఠాత్తుగా వెంటపడుతున్నాయి. దీంతో ప్రమాదాలకు గురై రోడ్డు మీద పడిపోతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.నాయుడుబాబు, గణేష్‌నగర్


ఆయుధ వ్యాపారుల వల్లే యుద్ధాలు


సమావేశంలో ఆచార్య అర్జున, తదితరులు

సీతంపేట : యుద్ధాలు నివారించి ప్రపంచంలో శాంతిని స్థాపించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇస్కఫ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గురువారం యూఎన్‌వో ఫార్మేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య పి.అర్జున మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలకు ఆయుధ వ్యాపారులే కారణమని, వారంతా అమెరికాలో ఉన్నారని తెలిపారు. అయుధాలకు ఖర్చు పెట్టే డబ్బు పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనకు వెచ్చించాలని కోరారు. ఇస్కఫ్ రాష్ట్ర నాయకులు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ప్రపంచ శాంతి, యుద్ధాల నివారణ లక్ష్యంగా 193 దేశాల భాగస్వామ్యంతో 1945లో యూఎన్‌వో ఏర్పడిందని గుర్తు చేశారు. రష్యా – ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్ – పాలస్తీనా యుద్ధాలతో లక్షలాది మంది చనిపోయారని, తీవ్ర ఆస్తి నష్టం జరిగిందన్నారు. యూఎన్‌వో చొరవ తీసుకుని చర్చల ద్వారా పరిష్కారం చూపి యుద్ధాలు నివారించాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎస్.యు.ప్రసాద్, జంగాలయ్య, రాజేంద్రప్రసాద్, బొడ్డు కల్యాణరావు, జీవన్‌బాబు పాల్గొన్నారు.

పెట్రోల్ దొంగల బరితెగింపు


పైప్ కట్ చేసి పెట్రోల్ అపహరించిన బైక్


పెట్రోల్ పైప్ తీసేసిన దృశ్యం

- పార్కింగ్ చేసిన వాహనాలే టార్గెట్

మద్రిపాలెం: పెట్రోల్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఇంటి వెలుపల పార్కింగ్ చేసిన వాహనాలే టార్గెట్‌గా చెలరేగిపోతున్నారు. మాధవధార, మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ఇంటి బయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను కొన్ని నెలల నుంచి ఆకతాయిలు టార్గెట్ చేస్తున్నారు. జన సంచారం లేని సమయంలో బైకుల పైపులు కట్ చేసి పెట్రోల్ అపహరించుకుపోతున్నారు. రోజురోజుకూ వీరి ఆగడాలకు అడ్డు లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ 49, 50 వార్డుల్లో పలు చోట్ల రాత్రి పూట విధులు ముగించుకుని ఇంటి బయట వాహనాలు పార్కు చేసుకుంటారు. రాత్రి వేళల్లో అలికిడి లేకపోవడంతో దర్జాగా ఆకతాయిలు పెట్రోల్ దొంగలించేస్తున్నారు. సత్యనగర్, పట్టాభిరెడ్డితోట, వైశాఖీ స్పోర్ట్స్ పార్కు, గ్యాస్ గొడౌన్, సౌజన్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంతాల్లోని ఇళ్లల్లో నివసించేవారు వారి వాహనాలు బయట నిలుపుతారు. ఆ వాహనాల ఆయిల్ పైపులు కత్తిరించేసి, బాటిళ్లలోకి పెట్రోల్ ఎత్తుకెళ్తున్నారని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ పైప్ కోసి ఓ బాటిల్‌కు కనెక్ట్ చేసి... సమీపంలో దాక్కుంటున్నారని... కొద్ది సేపటికి బాటిల్ నిండిన తర్వాత పెట్రోల్ పట్టుకుని ఉడాయించేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజుల కిందట 49వ వార్డులో ఇలానే చేస్తుండగా స్థానికులు గమనించి ప్రశ్నించడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారని చెబుతున్నారు. ఆకతాయిలకు భయపడి వాహనంలో తక్కువ పెట్రోల్ వేయించుకుంటున్నామని, పొరపాటున ఫుల్‌ట్యాంక్ చేయిస్తే మరుసటి రోజు ఉదయం చూసేటప్పటికి ఖాళీ చేసేస్తున్నారని వాపోతున్నారు. ఓ స్కూటీలో పెట్రోల్ దొంగతనం కోసం డిక్కీ బద్దలు కొట్టేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో ఓ బుల్లెట్, ఇతర వాహనాల నుంచి పెట్రోల్ అపహరించుకుపోయారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చాలా జరిగాయని, పోలీస్‌ల పెట్రోలింగ్ సరిగ్గా లేని ప్రాంతాలను టార్గెట్ చేసి దొంగలు రెచ్చి పోతున్నారని బాధితులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో సుమారు 30 వాహనాల్లోని పెట్రోల్ అపహరించుకుపోయారని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి పూట గస్తీ నిర్వహించాలని, ఆకతాయిలకు బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వీరేశలింగం జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం


ప్రథమ విజేతకు నగదు బహుమతి అందిస్తున్న ఎంపీ శ్రీభరత్, కళాభారతి ప్రతినిధులు

మద్దిలపాలెం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాభారతి ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు అంశంపై వ్యక్తిత్వ, వ్యాసరచన పోటీలు స్కూల్, కాలేజీ స్థాయిలో వేర్వేరుగా నిర్వహించారు. విజేతలకు గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బహుమతుల ప్రదానోత్సవం చేశారు. కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ఈట రాంబాబు, ఆచార్య చంద్రశేఖర్, రాజులతో కలిసి ముఖ్య అతిథి విశాఖ ఎంపీ శ్రీభరత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీఎండీఏ ప్రతినిధులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వీరేశలింగం వంటి మహనీయుల జీవిత చరిత్రను నేటితరానికి తెలియజేసేందుకు ఇటువంటి పోటీలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. కళాభారతి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ గొప్ప సంఘ సంస్కర్తల గురించి నేటితరానికి తెలిపే ఉద్దేశంతో ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ కళాభారతి ఆద్యుడు సి.ఎస్.ఎన్.రాజు అందజేసిన రూ.5 లక్షల ఎండోమెంట్ ఫండ్ మీద వచ్చిన వడ్డీతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అన్ని విద్యా సంస్థలను అభినందించారు. హైస్కూల్ స్థాయిలో వ్యక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3,000, ద్వితీయ బహుమతిగా రూ.2,000, తృతీయ బహుమతిగా రూ.1,000తో పాటు ప్రశంసాపత్రాలు, పుస్తకాలు ప్రదానం చేశారు. ప్రతి కేటగిరీలో ప్రోత్సాహక బహుమతులుగా రూ.500 చొప్పున 9 మంది విద్యార్థులకు అందించారు. కార్యక్రమ వక్త ఆచార్య కట్టమూరి చంద్రశేఖర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీరేశలింగం జీవిత విశేషాలను వివరించారు. ముందుగా వీరేశలింగం పంతులు సమకూర్చిన ప్రత్యేక పాటపై విశాఖ వాసులు లక్ష్మి సారథ్యంలో ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో 6 స్కూళ్లు, 9 కాలేజీల నుంచి 800 మంది వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్


బాధితులను ఎలా కాపాడాలో వివరిస్తున్న వలంటీర్లు

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ వలంటీర్ల మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో బాంబు దాడులు, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే... ఎలా బయటపడాలో... ఎలా ప్రాణాలు రక్షించుకోవాలో... ఇతరులను ఎలా రక్షించాలో కళ్లకు కట్టినట్లు చూపించారు విశాఖపట్నంలో గల జోనల్ సివిల్ డిఫెన్స్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్ధార్థ ప్రధాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు అందజేయాల్సిన సేవలు తెలియజేశారు. ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సివిల్ డిఫెన్స్ వలంటీర్లు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారని, ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని సిద్ధార్థ్ తెలిపారు. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ వలంటీర్లను అభినందించారు. డ్రిల్‌ను సివిల్ డిఫెన్స్ ఇన్‌స్ట్రక్టర్లు సుధీర్‌బాబు, వైవీ రెడ్డి పర్యవేక్షించారు.

ఏఎంసీలో ఫౌండేషన్ కోర్స్ ప్రారంభం


మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలో తాజా బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం 2 వారాల ఫౌండేషన్ కోర్సు గురువారం ప్రారంభించారు. జిల్లా న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఈస్ట్) లక్ష్మణమూర్తి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, అనాటమీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఎస్. రవీంద్ర కిషోర్ ఈ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీ శేషమ్మ ర్యాగింగ్ నిరోధక చట్టం, దానిలోని సెక్షన్లు, ప్రధాన నిబంధనలపై విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారికి విధించే వివిధ శిక్షల గురించి తెలిపారు. సైబర్ క్రైమ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడంతో పాటు నార్కోటిక్, సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్, పోక్సో యాక్ట్, మోటార్ వెహికల్స్ యాక్ట్‌లపై విద్యార్థులకు వివరించారు.

నైపుణ్య కోర్సులతో ఉపాధి అవకాశాలు


విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: నైపుణ్యం అందించే కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ నిర్వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం ఏయూలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఏయూ అందించే సర్టిఫికెట్‌కు అమితమైన విలువ ఉంటుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. భవిష్యత్తులో ఈ కేంద్రంతో సంయుక్తంగా మరిన్ని కోర్సులు నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నాక్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించిందన్నారు. ఏయూ అభివృద్ధిని వివరించారు. ప్రత్యేక అతిథి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఓఎస్డీ ఎ.ఎస్.శెట్టి మాట్లాడుతూ ఈ కోర్సుల నిర్వహణకు ఏయూ అందించిన సహకారాన్ని మరువలేమన్నారు. ఏయూతో కలిసి పనిచేయడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కోర్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ రీజనల్ డైరెక్టర్ బీరేంద్రసింగ్, సీనియర్ సాఫ్ట్ స్కిల్స్ ఫ్యాకల్టీ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


దుకాణాలు తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఇతర పోలీసులు

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ రోడ్డులో ఆక్రమణలను ద్వారకా సర్కిల్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. 'రోడ్డుపైనే దుకాణాలతో ట్రాఫిక్‌జామ్' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ భాస్కరరావు ఆక్రమణలు తొలగించారు. ఈ మార్గంలో ఇష్టారాజ్యంగా దుకాణాల ఏర్పాటుతో రోడ్డు కుచించుకుపోయింది. సీతమ్మధార నుంచి తూర్పు వైపునకు వెళ్లే రోడ్డు నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ రోడ్లు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కి ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సాఫీగా సాగిపోయేలా వ్యాపారులు, వాహన చోదకులు పోలీసు శాఖతో సహకరించాలని ఆయన కోరారు. 'సాక్షి'లో వార్త ప్రచురితమయ్యాక రోడ్డుపై ఆక్రమణలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నిర్మాణం ఆపేయాలని టౌన్‌ప్లానింగ్ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో 25, 26వ వార్డుల్లో గెడ్డ స్థలాలు, బఫర్ జోన్ ప్రాంతాలను ఆక్రమించి చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలపై ఈ నెల 22న 'దర్జాగా గెడ్డల ఆక్రమణ' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జోనల్ కమిషనర్ శివప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధు స్పందించారు. గెడ్డ స్థలాల్లో జరుగుతున్న నిర్మాణాలు పరిశీలించి రిజాయిండర్ విడుదల చేశారు. 26వ వార్డు అక్కయ్యపాలెం, క్రాస్ బేకరీ ఎదురుగా 80 అడుగుల రోడ్‌లో గెడ్డ పక్కన నిర్మిస్తున్న నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఇంటి నిర్మాణం ఆపేయాలని ఆదేశాలు జారీ చేశారు. సదరు లే అవుట్ వివరాల కోసం రెవెన్యూ విభాగానికి జోన్ – 3 నుంచి నోట్ జారీ చేశారు. అలాగే భవన నిర్మాణదారునికి నిర్మాణ పనులు ఆపేయాలని వర్క్ స్టాప్ ఆర్డర్ జారీ చేసినట్టు ఏసీపీ మధు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేయడం కష్టమని, అన్ని వివరాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట మెయిన్ రోడ్‌లో గెడ్డ పక్కన నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనానికి సెట్ బ్యాక్ డీవియేషన్ ఉన్నట్టు గుర్తించి నోటీసులు జారీ చేసినట్టు ఏసీపీ మధు ఇచ్చిన రిజాయిండర్‌లో పేర్కొన్నారు. సెట్‌బ్యాక్ డీవియేషన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గెడ్డపై ర్యాంపు నిర్మాణం, బఫర్ జోన్‌ను రహదారిగా మార్చుకోవడం వంటి ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు పైనుంచి ఇనుప రాడ్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


భవన యజమానితో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్ మెయిన్ రోడ్డులో గల ఇనుప రాడ్లను ఎట్టకేలకు తొలగించారు. 'ప్రమాదకరంగా ఇనుప రాడ్లు' శీర్షికతో ఈ నెల 24న 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఈ ప్రాంతంలో భవన నిర్మాణం కోసం తీసుకొచ్చిన రాడ్లను సంబంధిత యజమాని రోడ్డుపైనే డంప్ చేశారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతోపాటు ప్రమాదాలూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్ సంబంధిత యజమానిని గురువారం మందలించి భవన నిర్మాణ సామగ్రి రోడ్డుపై వేయరాదని హెచ్చరించారు. ఆయనవెంట ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు, సచివాలయం కార్యదర్శి హరీష్ ఉన్నారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలి


మైనార్టీ ఫ్రంట్ ఛైర్మన్ సుధాకర్‌ను సత్కరిస్తున్న శ్యామ్యూల్, బాబూరావు

సీతంపేట : దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.శ్యామ్యూల్ ఆనంద్ కుమార్, విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ కూచుపూడి బాబూరావు డిమాండ్ చేశారు. స్థానిక గురుద్వారా కూడలి సమీపంలోని చర్చిలో ఆల్ ఇండియన్ క్రిస్టియన్ మైనార్టీ ఫ్రంట్ ఛైర్మన్ ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫ్రంట్ ఛైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించనున్న బాలకృష్ణన్ కమిషన్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. 1950లో కేవలం హిందువులలోని ఎస్సీలకు మాత్రమే ఈ రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. క్రైస్తవం స్వీకరించిన దళితులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ రెండు దశాబ్దాల కిందట సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో బాలకృష్ణన్ కమిషన్ పర్యటించనున్నందున వారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం క్రిస్టియన్స్ సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న ఆల్ ఇండియన్ క్రిస్టియన్స్ మైనార్టీ ఫ్రంట్ ఛైర్మన్ ఎం.సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

తాటిచెట్లపాలెం : రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి బాబాకు అర్చనలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం బాబా భజన, పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉచిత వైద్య పరీక్షలు

ధ్యాన మందిరం ఆవరణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టైయో ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 120 మంది భక్తులు, స్థానికులు పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శిబిరంలో రమేష్, ప్రసన్న, యశ్వంత్, ముకేష్ పాల్గొన్నారు.

ఏయూ విభాగాల్లో రెక్టార్ తనిఖీలు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలోని పలు విభాగాలను గురువారం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య, తత్వశాస్త్రం, ఇంగ్లిష్, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీతో సహా పలు విభాగాలను సందర్శించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరవుతున్నారని, కళాశాల వేళల్లో డిపార్ట్‌మెంట్లలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండటంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆయా విభాగాల్లో బోధనను రెక్టార్ ప్రత్యక్షంగా పరిశీలించారు.